కథానిక

# ప్రశ్నోపనిషత్

తెన్నేటి అహల్యాదేవి

కర్మకాలి లక్నో వెళ్ళివచ్చాను. శీతాకాలం వేళ్ళు కొరళ్ళువారే చలి అక్కడ. ఏదోవింతగా కనపడితే లాంకోటు లాటిది ఒకటి కొనితెచ్చాను. ఇంకేముంది? కోరి నెత్తికి కొరివి తెచ్చుకున్నట్లయింది. రైలు దిగానో లేదో—ఆ ముఖాలు ఆ వైఖరులు చూసి తీరాలి. నేత్రాలు మొత్తంగా ప్రశ్నార్థకాలూ, ఆశ్చర్యార్థకాలూగా మారిపోతాయి. ఇక ఎగాదిగా చూసే వారందరిమధ్యన జంతుప్రదర్శన శాలలో ఓ విచిత్రప్రాణిలాగా ఉక్కిరిబిక్కిరి ఐపోతున్నాను. పాత స్నేహితులు ఎదుట పడ్డాం ఆలస్యం—పకపకలు, వికవికలు!

"అరే! ఇలా ఐపోయినావేమిటి మహానుభావా?" నేను ఏ చింపాంజీ లాగానో మారిపోయినట్లు—ఆ విరగబడినవ్వేందుకు అంతూ పంతూ లేదు. పడి దొర్లడమే తరువాయి. ఏమిటీ శిరచ్ఛేదం, వెధవ ఛిద్రమూనూ! ఏమనను? ఏదో—అన్నాను ఆఖరికి!

"ఏమిటయ్యా ఇది! క్షేమమేగదా! కొంపదీసి పిచ్చీ గిచ్చీ ఎక్కలేదుగదా మీ అందరికీ?"

"అబ్బో! ' అభిమానంకూడా తోడైందా మహాత్మా? దీంతో ఫోటో తీయించుకోక పోయారా? ఫోటో..."

ఏమనాలి నేను? ఏమీ అనలేదు.

"ఏమండీ ఎక్కడ పట్టుకొచ్చారు దీన్ని? మహా జోరుగా వుందిలెండి. మైసూరు మహారాజా వారైపోయినారే కేవలం!"

"ఇంతకీ దీన్ని ఏమన్నట్టు? కోటూ, షర్టా మరోటా?"

* * *

సుల్తాన్ బజారు పోతున్నాను — అలవాటు చొప్పున చోగా బుజాలమీద వేసుకొని. వెనక నుంచి వినిపించాయి——

"ఏమండోయ్! మిమ్మల్నే...నమస్తే అంటున్నాను."

వచ్చిపడ్డాడొక మహానుభావుడు ఉల్కాపాతంలా.

"బలేవారు స్వామీ! నేను మిమ్మల్ని గుర్తే పట్టలేక పోయానంటే నమ్మండి. ఏ పాదుషా వారి యొక్క ఆస్థాన కవి చిత్రపటమో చూస్తున్నట్టుంది...అయితే, ఏవిదేశపు సరుకండీ ఇది? తెప్పించారా!"

"లేదు మహాశయా! ఉండలేక లక్నోపోయినాను. అక్కడనుంచి తెచ్చాను.

"కొన్నారా? కొత్తది!"

"ఊహుఁ! పాతది కొంటారుగాబోలు!"

"లేదండి. పరిహాసంగా అన్నాను. అయితే కొత్తదన్నమాటే! బాగుంది. మరి స్వామీ, దీని పేరేమంటారు!"

"చోగా"

"అదే చొక్కా అన్నట్టు: అయితే ఇహ చలి మీజోలికి రాదన్నమాట!" (చేతితో తడువుతూ) "అబ్బ! చాలా వెచ్చగా వుండేట్టుంది! ఇంకేం కావాలండి ఈ కాలంలో...అరే! దీనికసలు గుండీలున్నట్లు లేదే!"

"చోగాలకు వుండవు స్వామీ!"

"ఏం?"

"ఏమీ లేదు."

"అదే అడుగుతున్నాను. ఎందుకుండరాదు గుండీలు? మనం కుట్టిస్తే?"

"ఓ. మనసొచ్చినవారు హాయిగా కుట్టించుకోవచ్చు."

"అయితే మీరెందుకు కుట్టించకూడదూ?"

"చోగాల పద్ధతి ఇలానే వుంటుందని."

"ఆఁ పద్ధతిని వూరుకుంటే ఏంలాభం? దుస్తు అన్నతర్వాత గుండీలేకుండానా! అవి లేకపోతే

చలికి ఆపులేదు కదండి. మరి చల్లగాలి తగిల్తే జలుబు చేసుకొస్తుంది. "మీరు మాత్రం గుండీలు పెట్టించండి...సరేనా?"

ఈ చొప్పదంటు ప్రశ్నలతో నా పని ఆలస్య మైపోతోంది. పైగా ఏంజవాబులు చెప్పాలివీటికి?

ఈ పృచ్ఛక మహాశయుడు దారికట్టి అడ్డంగా పాతుకు పోయాడు. జలగలాగా నెత్తురు పీల్చి వేస్తున్నాడు.

"ఇంతెత్తు కాలర్లేమిటండి దీనికి కాంపౌండు గోడల్లాగ?"

"ఓహో! అదాసంగతి. కనిపిస్తుందాండి మరి!"

"చెవులతో కాదు కదా స్వామీ, మనం చూసేది!"

నడివీధిలోనే ఈ రభసంతా. ఇంతలో మరో ఆయన చేరాడు ఆయన చుట్టం వారి కుశలప్రశ్న లన్నీ చచ్చినట్లు వింటూ మ్రోడై నిలబడ్డాను. ఇకతర్వాత నన్ను పరిచయం చేయడం. తప్పని సరిగా చెయ్యికలిపి "చాలా సంతోషమండి మిమ్మల్ని చూసినందుకు" అన్నాను. పరిచయమైంది గదా! చాలు. ఆయన కూడా ప్రారంభించాడు.

"ఏమండీ! ఇంత పెద్దచేతులేమిటండీ దీనికి?" (ఒకచేయి ఎత్తిపట్టి) "ఈ చేతులు తొడుక్కుంటే రెండు వైపులా రెండుచేతులూ తొండాల్లా వుంటాయిగదండీ వ్రేలాడుతూ!..."

"ఏదోనండి"

"కొంచెం కత్తెరవేయించి తగ్గిస్తే బావుంటుందని నా అభిప్రాయం."

"కృతజ్ఞుణ్ణి. కాని దాని అందం చెడుతుందని."

"ఏం?"

"ఏంచెప్పను?"

ఇక సలాం కొట్టి పోవాలని చూస్తున్నాను. ఒక్కొక్కరు చేరి నన్ను చుట్టేసేలాగున్నారు జనం. కాని ఆ పుణ్యపురుషుడు నాతోకూడా బయలుదేరి నట్టుంది.

"అహా...నాకు బోధపడటం లేదు. ఇంత పెద్ద చేతులుండటం ఏం ప్రయోజనమండీ?"

"స్వామీ! ఎప్పుడైనా బుద్ధిపుడితే, ఈ చేతుల్లో కాళ్ళుదూర్చి పైజామాలా ఎగదొడుగు తాను. అదీ సంగతి" అన్నాను తోకతుదిగిన ప్రాణంతో.

"భలే, భలే చమత్కారంగా శలవిచ్చారే! ఎలాగైనా కవులుగదా!"

* * *

స్వెటర్లనీ, సూట్లనీ ఒక మణుగు ఉన్ని, గాడిద బరువులా మోసే నాగరిక మహాశయులుగూడా ఈ చోగానుగూర్చి ఇలానే చంపుకు తింటం చూస్తే, చాల కోపంవచ్చేది ఒక్కొక్కసారి. ఈ చోగా ఏమోగాని నా ప్రాణానికి ఒక సంకట మైంది; నాపాలిట తలా తోకాలేని ప్రశ్నల మూట అయింది.

పీడాపోతుందని దాన్ని చింపించి బల్ల గుడ్డగా వేయించాను. నా సంకటం క్రొత్తరూపు ధరించింది. వీధి పొడవునా, "అరె! ఏదండీ చోగా? ఎంత బావుండేదండి!" "నేం చెప్పినట్లు గుండీలు పెట్టిస్తే మోహనంగా వుండేది." "చలికాలంలో పారవేసుకోడం ఎంత తెలివితక్కువండి!" ఇత్యాదులు.

బజార్లో ప్రశ్నలకి భయపడి, పారిపోయివచ్చి ఇంట్లో పడ్డాను. నాకోసం ఎప్పటినుంచో వేచియున్న మహాశయుడొకాయన లేచి, నా కంగారు చూచి—

"ఏమండీ క్షేమమేగదా! ఏమిటి హడావిడి? ఆః ఏంలేదు. చూచిపోదామని వచ్చేను. ఒక అరగంటైంది."

"చచ్చాన్రా దేవుడా!" అనుకున్నాను. ఇంకా కూలబడలేదు.

"ఇందాకటి నుంచీ, ఈ టేబుల్ క్లాత్ పరిశీలిస్తున్నాను. ఎంత బావుందండి! ఉన్నదికాదూ ఆఁ జ్ఞాపకమొచ్చింది. మీ చోగాబట్టలాగేవుంది కాదండీ ఇది అచ్చంగా...అన్నట్టు ఈమధ్య మీరు చోగా వేసుకోవటంలేదు. ఏమై పోయిందది?..."

నా కాళ్ళూ, చేతులూ చల్లబడ్డయ్.

* * *

ఎప్పుడూ నాలో ఏదో వైచిత్ర్యం వుంటూనే వుంటుంది చూచేవారికి. కొన్నాళ్ళనించీ, మెదడు సరిగ్గా పనిచెయ్యడం మానేసింది. వంటకూ ఇలాంటి పరిస్థితికీ జత కుదరదు. గాండ్ల వీధిలో మంచి రవ్వ అమ్ముతున్నారని తెలిసి పోయి తెచ్చుకున్నాను. ప్రస్తుతం 'నాలిగల బ్రహ్మచర్యము' లాగుంది నా

పని. ఏదో గుజ్జెనగూడులా వండితే పని కష్టం వుండదు. తేలిగ్గానూ అరుగుతుంది. అని ప్రొద్దున్నే ఫలహారం వంట ప్రారంభించేను.

ఇంతేనండి విషయం. ఇక చూశారూ! అసలే పనీ పాటూ లేని 'నాగరిక' మిత్రులికి తీర్థమై పోయింది నా కొంప. అందులో ఈ గుజ్జెన గూడొకటిపెట్టి కంఠానికి తెచ్చుకున్నాను.

తెల్లవారనేలేదు. వేంచాశాడు ప్రబుద్ధుడొకడు, తాను రాకపోతే ఆ నాడిక సూర్యుడుదయించడే అన్నట్టు. సరే వచ్చాడే అనుకోండి. గడపలో కాలు పెట్టాడో లేదో బాణంతీశాడు.

"ఏం మహాత్మా! శాకపాకాలేం తయరౌతున్నా యేమిటి?" అన్నాడు పెత్తనాల ముత్తయిదువ పేరక్క నడిగినట్లు.

"ఏం వంటలేండి...పిండి" గుజ్జెన గూడనో జావనో ఎలా చెప్పేదిమరి!

"అరె! పిండి! పిండేమిటండోయ్? కాఫీ మానేశారా యేమిటి?"

"కాఫీకూడా తాగుతాను."

"పిండికూడానా?"

"పిండి తాగరుస్వామి!"

"ఔనౌను తింటారు. అదేసరే కాని మీరు పిండి ఎందుకు తింటారు?"

"ఏమీలేదు ఏదో ఫలహారం."

"అలాగా! పిండి కాఫీకంటె లాభకరమేం?"

"అవునండి త్వరగా జీర్ణమౌతుంది."

"త్వరగా జీర్ణమా? అహా? అయితే నేనుకూడా పిండి ఫలహారం ప్రారంభించనేమిటి?"

"ప్రారంభించండి ఎవరొద్దంటారు హాయిగా ఆరగించండి ముప్పూటలూ."

"హాయిగీయి ఎమిటిగాని, మీరు చెప్తే ఆరంభం చేస్తాను. కాని స్వామీ పేగుల్లో గోల మొదలు కాదు కదా!"

"అహా, అలా ఎందుకౌతుంది. చాల తేలికాహారంగదండీ అందుకేగదా రోగులకి తినిపిస్తారు!"

"ఆ!...కాని నేను రోగిని కాదుగదా! ఐనా, బదిలీ ఐవచ్చినప్పణ్ణించి చూస్తున్నాను. నాకీ వాతావరణం సరిపడలేదండి! తిండి అరగటంలేదు. ఎప్పుడూ పేగుల్లో అరవటమే."

ఏం సమాధానాలు చెప్పను? ఎందాకా కత్తెరలాగా తెగేసుకు ముందుకు పోతోంది ఆయన నాలిక. నా జావతప్ప మరోవిషయమే లేదా ఈ విశాల ప్రపంచంలో సంభాషణకి పనికొచ్చేది! నేడీయన తన ప్రాపంచిక వ్యవహారాల్నించి సెలవు తీసికొని, కేవలం జావను గూర్చిన పరిశోధనలు పూర్తికాకుండా పోయేలా కనపడ్డంలేదు. లేస్తే మర్యాదకి తప్పు. కూచుంటే ఈ ప్రశ్నల ముప్పు. అవతల నా జావ పోయిమీద ఏమయిపోతోందో ననే యావ.

అతి కష్టంమీద 'క్షమించాలి' అంటూ లేచాను. పొయ్యి తెగమండుతోంది. చూస్తే బాగా అడుగంటి పోయింది. ఆయన కనిపెట్టి పొయ్యిదగ్గరికి పరిగెత్తుకొచ్చాడు. గజేంద్రుని మొరవిన్న మహావిష్ణువులా!

"అరెరే! ఏంచేశారండి. ఎంతపనైపోయింది పాపం! నీళ్ళూ నిప్పూ, ఎక్కువ తక్కువ తెలియకపోతే! ఇదంతా మాడబెట్టేశారే శుభ్రంగా! నీళ్లు చాలా పోయాల్సింది...అసలు, కొంచెం లేచి ఎందుకు చూశారుగాదూ మధ్యలో... నాతో చెప్తే నేం చేసిపెట్టేవాణ్ణే. ప్రతిదినం మీరిలానే రవ్వంతా పాడుచేస్తూంటారా?"

నాకు ఓర్పు నశించుతోంది. చిరాకుగా అన్నాను "మహాత్మా ఎందుకీమాటలు? అయిందేదో అయింది."

"బలే! ఎందుకేమిటి? మీ ఇంతశ్రమ పాడైపోయింది. ప్రతిపనికీ నేర్పుకావాలి స్వామీ. రేపట్నుంచీ మీరీ పిండిఫలహారం మానెయ్యండి. చెడ్డచిరాకుదాంతో... సరే ఇకపోతాను...మీకెక్కడా తీరికే వుండదు ఎప్పుడు వచ్చినా. సెలవు. నమస్తే."

పట్టినభూతం వదలినట్లనిపించింది. కోపంకొద్దీ పాత్రలో మంచిగా వుందనుకొన్నభాగం గీకిగీకి తినేశాను. కాని ఆ మాడుసరుకంతా ఎక్కించేసరికి, జీర్ణంకాక చాలా దురవస్థ పడ్డాను తర్వాత.

* * *

ఆనాడు సాయంత్రం బజారుకు బయలుదేరాను. ఎప్పటిదో ఒక రూళ్ళకర్రలాంటి 'బాటన్' వుంటే సరదాకి బయటికి తీశాను. చక్కగావుంది

చేతులో పట్టుకు తిరగడానికి. దారిలో తారసిల్లాడొక ఛాందసుడు.

"ఏమిటిది? లాటీకర్రా! మీదే ఈ లాటీకర్ర!"

"ఔనౌను. ఇదిలాటీకర్ర."

(వికవికనవ్వి) "అదే అంటున్నా...లాటీకర్ర! ...ఏమండి ఎంతుంటుంది?...బరువు."

"వుంటుంది ఒక సేరున్నరమీద చటాకున్నర."

"బాగుంది. (చేతితో అంచనావేస్తూ) అబ్బా! బరువేవుంది. చేయి తీపుపెట్టదండీ?"

"ఊహుఁ."

"ఎప్పటినుండి వాడుతున్నారండి దీని?"

"చాలా నాళ్ళనుంచి."

(నేలమీద కొట్టిచూచి) "కొయ్యదే!...కాని చాలా విచిత్రంగావుంది...చేతి రాపిడికి కాబోలు ఇంత నున్నపడింది."

"ఊఁ."

"ఇది ఎప్పుడూ ఇంతే పొడవా? లేక ఏ వంకె కర్రనో తలతీసి బోడిచేశారా?"

"ఊహుఁ"

"ఇదే పోతే ఎలానండి."

"మరోటి కొనాలి."

"బాగుబాగు...పాలిష్ చేసినట్టుందిగాదండి!"

"ఏమోనండి."

"నేనుకూడా ఒకటి కొన్నేమిటి? పట్టుకు తిరగడానికి బాగుండేటట్టుంది."

"ఒకటేమిటి పదికొనండి. నాదేం పోయింది?"

"మీదేంపోతుందికాని నేను మాత్రం అలా చెయ్యను."

"మంచిది చెయ్యకండి."

"అదికాదండి. లోకులేమంటారు. వీడికి మతిపోయింది, కర్రపట్టుకు తిరుగుతున్నాడేమిటి అని. సరేకాని దీంతో ఎవరైనా మూడునాల్గు వడ్డిస్తే ఏమవుతుందండి?"

"అరెరె! వడ్డించడ మెందుకయ్యా అనవసరంగా."

"అనవసర మేమౌతుంది? ఎప్పుడైనా తల పట్లు, కొట్లాటలువస్తే చూసుకోండి ఇహ, మీదే పైచేయి. తగిల్నివాడు నేలకరచుకొని లేచేదిలేదు. (నేలపై కొట్టిచూసి) చెట్నీఐపోవలసిందే."

ఇదీ వరస. కాష్ఠపురాణం. ఎక్కడికన్నా పోతే నన్నడిగేవాడు లేడు. లాఠీమీదే ప్రశ్నల పరంపర. ఎలాచెయ్యనీ సంకీర్ణయుద్ధం. కొన్ని తావుల్లో నేను 'లాఠీస్వామి'గా ప్రసిద్ధికెక్కాను, నేనే ఒకలాటీనైనట్లు!

* * *

నా మనోస్వాస్థ్యం చెడిపోయినట్లు తోచింది. ఎటన్నా పారిపోతే బాగుండుననుకున్నాను. నా మిత్రులు కొందరివద్ద కొన్నాళ్లు కులాసాగా గడపాలని మచిలీపట్టణం పోయాను మార్పుగా వుంటుందని. కాని విద్యావంతులైన మిత్రులకి గూడా ఇదే రోగం వుంటుందని నేననుకోలేదు. 'జ్ఞాని'గారు అక్కడ లెక్చరర్. ఆయనవద్దనే బసచేశాను.

రోజూ సాయంత్రం మరికొందరు మిత్రులతో కలిసి స్క్వేర్‌కి పోవడం, రమా హోటల్‌లో కొంతసేపు కాలక్షేపంచెయ్యడం. ఒకొక్కప్పుడు బసకు (జ్ఞానిగారి ఇంటికి)వచ్చేసరికి రాత్రి పదకొండు దాటేది. ఒకనాడు జ్ఞాని ఒంట్లో బాగాలేదు. అంచేత మమ్మల్నివిడిచి ముందే ఇంటికిపోయాడు. ఇక్కడ మా బాతాఖానీలో రాత్రి పన్నెండు దాటిపోయింది ఆనాడు. ఇంటికి పోయినాను. జ్ఞాని మిద్దెపైన పడుకుంటాడు. నేను అతనికి అనవసరంగా నిద్రాభంగమని పిల్లిలాగా పైకెక్కాను. పడుకున్నానుగాని, ఉడకపోస్తుండడంచేత లేచి చొక్కా విడచి లోపలపెట్టివచ్చానోలేదో దగ్గుతెరవచ్చి మేల్కొన్నాడు ఆయన. అరగన్నులో 'వచ్చారూ' అని మళ్ళీ ఏరుదాటాడు.'

పడుకున్నాను. 'ఇప్పుడు ఉడకపోస్తోంది; కాని తెల్లవారుజామున చిలివేస్తే కష్టం'అనిపించి మళ్ళీ గదిలోకి వెళ్ళి చొక్కా తెచ్చి తొడుక్కున్నాను. ఇంకా నిద్దరరావటంలేదు గనుక ఒక సిగరెట్టు వెలిగించాను. నిప్పుపుల్ల రాపిడికో, వెలుతురుకో ఆయన మళ్ళీ లేచాడు. లేస్తూనే "ఈ చొక్కా ఎందుకు విప్పినట్టూ, మళ్ళీ ఎందుకు తొడుక్కున్నట్టూ?" ఇప్పుడూ ప్రశ్నలు తప్పలేదుగదా అని నాకు ఆపరాని నవ్వువచ్చింది. ప్రశ్నలు విని కోపానికి మారు నాకు మొదటిసారిగా నవ్వువచ్చింది. వెనుకటి ఘటనలన్నీ జ్ఞప్తికివచ్చి పెద్ద నవ్వు లంకించుకున్నాను.

"అరె, ఇదేమిటోయ్! అర్థరాత్రివేళ మద్దెల దరువని, ఏమిటా పకపకా! కులాసాగానే వున్నావా? కొంపదీసి..."

సమాధానంలేని నా నవ్వు ఆయనకూ సోకింది. పోటీలుపడి నవ్వుతున్నట్లుంది ఇద్దరం. కృత్యాద్య వస్థమీద వెల్లగించుకుని అన్నాను:

"అదంతా ఓ పెద్ద గాథ. ప్రశ్నోపనిషత్. ఎన్నో సంఘటనలు జ్ఞాపకంవచ్చాయి, అప్పటి హాస్యానికి ఇప్పుడు నవ్వు...ఒక కథ వ్రాసేస్తా నిదంతా..."

"కథా? ఏంకథ? ఎందుకు?"

నేను మళ్ళీ ఫక్కుమన్నాను. దేవుడా మళ్ళీ వచ్చిందా ప్రశ్నతుపాను! చివరకు జ్ఞానికూడా ఇలానే కావాలా అనుకున్నాను.

"ఎందుకలా నవ్వుతావు? కథేమిటి? ఇప్పుడేం కథ తెల్లవారొస్తుంటే...బాగుంది నీ కథ."

"పోనీవోయ్, ఒంట్లో బాగాలేదు. ముంచు కొచ్చే నిద్ర... మాట రావడంలేదు... ఇంకేం అడగకు."

"నాకేం బోధపడ్డంలేదు. ఇంతకూ పని వేళా చొక్కా ఎందుకు తొడుక్కున్నట్లూ-మళ్ళీపోయి తెచ్చి ఎందుకు తొడుక్కున్నట్టూ—"

* * *

ప్రశ్నలదగ్గర అందరూ ఒకటే. పండిత పామర విభేదం లేను, పరిచిత, అపరిచిత భేదం అంత కంటె లేదు.

నేను నిశ్చయంచేసుకొన్నాను. ప్రశ్నోత్తరాల బారినుంచి విముక్తి అవసానకాలంలోనే.

సరే! చాలాజీవితం గడిచింది. ఏ కొంచమో శేషించివుంది. కానీ ఎలానో బాధపడదాం. చచ్చింతర్వాతనైనా ప్రశ్నలనుండి విముక్తిలభిస్తుంది కదా!

కాని, స్వామీ! అదీలేదు. మన శాస్త్రాలు చూస్తూంటే ఆ ధైర్యానికికూడా ఆస్కారంలేదు. చావగానే ఏ శివదూతలో విష్ణుదూతలో వస్తారు. "ఏ మతంనీది?" "శైవుడవా, వైష్ణవుడా?" "అడ్డ బొట్టా, నిలువబొట్టా"... అని మళ్ళీ ప్రశ్నల మొదలు అంతటితో వైకుంఠమో, కైలాసమో లేకపోతే నరకమో ఏదో పరలోకం, దర్వాజా తెరుచుకొంటుంది.సరే! ఏదోఒకటి. ప్రశ్నల పీడైతే వదిలింది అని ఆశించవచ్చు.

ఓహో, లేదు మర్చిపోయాను. ఎక్కడ వది లింది అప్పుడే! పురాణాలు చెప్తాయి కాదూ! "యమధర్మరాజు, ఒక పాదం అగ్నిలో, ఒక పాదం చందనంలో పెట్టి కూర్చుని ఒక్కొక్కణ్ణి విచారిస్తాడని. చచ్చాంరా భగవంతుడా, పుణ్య పాపాల చిఠ్ఠాలతో చిత్రగుప్తుడు తయారు. తర్జన భర్జనలు సాగుతాయి.

"ఇన్ని నీళ్లెందుకు వృధాచేశావు? వెనకవాళ్లకు మిగిలిందో లేదో చూడకుండా ఎందుకలా తెగ తిన్నావు? తెగవాగటం దేనికి? కళ్లు మూసుకు నడిచి అన్ని చీమల నెందుకు హతమార్చావ్? పరీక్షల్లో టీలు తాగి తెల్లవార్లు మేల్కొని రోగ మెందుకు తెచ్చుకొన్నావు? తీరా ఇల్లుచేరి రిక్షా వాడితో ఎందుకు దెబ్బలాడావు? పంజరములో చిలుక నెందుకు పెంచావు! తోటలో గాడిద నెందుకు చంపావు? నీ యింట్లో ఎలుకలన్నిటినీ పట్టిపట్టి పొరుగువాడింట్లో ఎందుకు వదిలావు? రాత్రివేళ పాడిపాడి వాడ ప్రజలందరినీ జాగరణ ఎందుకు చేయించావు? కరణంగారి నమస్కారానికి ప్రతినమస్కారం ఎందుకుచేయలేదు? సీసాల్లో రంగునీళ్లుపోసి మందులని డబ్బు ఎందుకుగుంజావు? జాకెట్‌కు 2గజాలు కావాలని గుడ్డ ఎందుకు కొట్టే శావు? క్లాసులు ఎగగొట్టి టీచరు అడిగితే మా ఫాదర్‌కు (తండ్రికాదు!) సీరియస్‌గా వుంటాడని ఏం అబద్ధమాడావ్? బ్రూక్‌బాండ్ కాఫీడబ్బాలో చౌకబ్రాండ్ కాఫీ ఎందుకమ్మావు?...ఇత్యాదులు

ఇంతకూ ప్రశ్నోత్తరాలనుండి విముక్తి అనేది ఎన్నటికీ వుండదనేది నిర్వివాద సారాంశం.

దీని భయం నా కంతగాలేదు. ఈ భూలో కంలో స్నేహితులంతా, నరకమో స్వర్గమో ఆ పరలోకంలో కూడా ప్రేతాత్మలుగా తయా రౌతారే! మళ్లీ నా చేపలతొట్టి, ఆ చోగా, ఈ లాఠీ, నాటి జీవపురాణం అన్ని తిరిగి తోడితే ఎలా? ఎప్పుడూ నా కిదే దిగులు!